# తుమ్మచెట్టు

నన్ను చూస్తే మీకు నవ్వుగా వుంది. 'తుమ్మచెట్టుకేమిటి? స్వగతం ఏమిటి?' అనుకుంటున్నారు మీరు. మీరు కుర్రవాళ్లు. అలాగే అనిపిస్తుంది మరి. తాతలను చూస్తే వాళ్ళిప్పుడు ఉన్నట్టే యెప్పుడూ వున్నారు అనిపిస్తుంది మనుమలకు. తాతల అనుభవాలు మనుమలకేం తెలుస్తుంది? పిల్ల కాకి కేం తెలుస్తుంది వుండేలుదెబ్బ! అందుకని నన్ను చూస్తే మీకు ఎగతాళిగానే ఉంటుంది. అందులో నేను వట్టి తుమ్మచెట్టును కాదు; నల్లతుమ్మచెట్టును.

మీరు పాతసంగతు లన్నిటినీ మరిచిపోతారు. కొత్త సంగతులు నేర్చుకోవద్దని నేను అనను. కాని పాతను మరిచిపోవలసిన అవసరం ఏముంది? కొత్తమాత్రం ఎక్కడనుండి వచ్చిందేమిటి? పాతనుంచేగా! మనం వూరికినే అనుకుంటాం కానీ, పాపం తెలియనివాళ్ళకు కొత్తా తెలియదు.

నన్ను గురించి తెలుసుకోవాలంటే మీ తాతలనూ, అమ్మమ్మలనూ అడిగిచూడండి. నా ఘనత వారికి తెలుసు. మా జాతిని వారు యేరి కోరి తీసుకువచ్చి పొలం గట్లమీద నాటేవారు, నేను లేని చేననేది వుండేదా ఆ రోజుల్లో! పొలానికి ధర కట్టేటప్పుడు మేము వున్న పొలాలు ధర హెచ్చు. లేని పొలాలు ధర గక్కువ. రైతులు ప్రాణాలనైనా వదులుకునేవారు కానీ, మమ్మల్ని వదులుకునేవారు కారు. ఈ తుమ్మ మాదంటే మాదని ప్రాణాలు తెగించి పోట్లాడుకునేవారు. మామీద వాళ్ళ కంత మమకారం వుండేది. ఇప్పుడు మీకో? మీకు నల్లతుమ్మంటే పనికిరాని మోడై కనిపిస్తుంది. అందుకని 'దీన్ని నరికివేయండి' అని తేలికగా అనగలుగుతున్నారు. ఎంత అన్యాయం!

నావి ఆడంబరంలేని అలవాట్లు. నాకు యెక్కువ నీరు గానీ, యెరువుగానీ అక్కరలేదు. కాస్త స్థలం చూపించి, వదిలిపెడితే నా బ్రతుకు నేను బ్రతుకగలను. నన్ను రక్షించడానికి ఎవ్వరూ నా చుట్టూ కంచెను నాటి శ్రమపడవలసిన అవసరం లేదు. పశువులు మొదలైనవాటినుండి నన్ను నేనే రక్షించుకోగలను! చూస్తున్నారుగదా! శరీరంమీద నేను పెంచుకున్న ఈ ముండ్లను. ఇవే నన్ను అనేక అపాయాల నుంచి రక్షించగలవు. నా జోలికి ఎవ్వరూ రాకుండా చూడగలవు.

నా ఈ ముండ్లవల్ల రైతులకు అప్పుడప్పుడూ బాధకలిగేమాట నిజమే. బాధేమిటి? వారి పాదాల్లో నేను విరుగని చోటనేది వుండదు. అయినా వారు నన్ను విడిచిపెట్టరు. నేనంటే వారికి యిష్టమే. ఎందుకో తెలుసా? నా విలువ వారికి తెలుసు, నేను వారి శ్రేయస్సు కాంక్షించే దానినని వారికి తెలుసు.

నా వల్ల రైతులకు అనేక లాభాలు వున్నాయి. చాలా మొక్కలు, వృక్షాలు భూసారాన్ని పీల్చి భూమిని గుల్లచేసి తాము జీవిస్తాయి. నేను అటువంటిదాన్ని కాదు. నా భూమికి సత్తువ ఎక్కువ అవుతుంది. ఎందుకలా వొకరి ముఖాలు ఒకరు చూసుకుంటారు? నా మాట నమ్మలేకుండా వున్నారా? నా మాట నిజం. కావాలంటే తెలిసినవారిని అడిగిచూడండి. మీరు నాకంటే పెద్దపెద్ద వృక్షాలను చూసివుంటారు. పెద్దపెద్ద ఆకులతో, పూలగుత్తులతో తమని చూచుకుని తామే మురిసిపోయే అనేకచెట్లను చూసి వుంటారు. రైతులకుమాత్రం వాటిమీదకంటే నా మీదే యెక్కువ మమకారం. పెద్దపెద్ద ఆకులు వేసే చెట్లక్రింద యింకేదీ బ్రతకదు. స్వార్థపరత్వంతో కరుడుకట్టిన జీవితాలు వాటివి. నేను అటువంటిదాన్ని కాను. నా ఆకులు చిన్న చిన్నవి. కావాలనే నేను చిన్న చిన్న ఆకులు వేస్తాను. అందువల్ల నన్ను ఏ చేనుగట్టుమీద వేసినా వేయవచ్చు. నా నీడ పడి యే పంటా చెడదు. మీకీ సంగతులు తెలియవు. భూదేవికీ మీకు వున్న సంబంధం పూర్తిగా తెగిపోయింది. అందుకని "ఈ ముళ్ళచెట్లను తీసుకువచ్చి చేల గట్లమీద వేసుకుంటా రెందుకు రైతులు? చెపితే వినరు చాదస్తులు" అని ఈసడించుకుంటారు.

అయితే నీకంటే నిరపాయం అయిన చెట్లులేవా—అని మీరడుగవచ్చు ఎందుకులేవు? వున్నాయి కానీ రైతును, ఇబ్బంది పెట్టకుండా పెరుగుతూ నేను ఉపయోగ పడేటట్లు ఉపయోగపడే చెట్టు ఇంకొకటి లేదనిమాత్రం గట్టిగా చెప్పగలను కుర్రవాళ్ళు, మీకు తెలియకపోవచ్చు. మీ తాతలను అడిగిచూడండి. నాలో ఉపయోగపడని భాగం ఒక్కటికూడాలేదు. నా కలప రైతుల బండ్లకు వుపయోగ పడుతుంది. రైతులు ఉపయోగించే కొడవళ్ళు మొదలైన వాటికి పిడులుగా వుపయోగపడుతుంది. నాలోనుంచి వచ్చే జిగురు మీరు చూసేవుంటారు. 'తుమ్మజిగురు' అనేమాట వినని వారు ఎవరుంటారు? ఈ జిగురు అంటించుకోవటానికి వినియోగ పడుతుందని మీకు తెలుసు. కానీ, మందులకు అనేకరీతుల నా జిగురు వినియోగపడుతుంది. నా కాయలు పశువులకు మంచి మేత. బాగా పుష్టినిచేకూరుస్తాయి. పశువులు నా కాయల కోసం యెంత ఆరాటపడతవో, ఈనాడు మీకు తెలియక పోవచ్చు. పశుల కాపర్లను అడిగిచూడండి. లేకపోతే ఒక మేకను పెంచి చూడండి. ఆఁ మరచిపోయాను, నా బెరడుకూడా నిరుపయోగంకాదు. తోళ్ళ పరిశ్రమకు ఎంతగానో సహాయపడుతుంది. తోళ్ళను పరిశుభ్రపరచడానికీ, పదును యెక్కించటానికీ నా బెరడు తోడ్పడినట్లు తోడ్పడే వస్తువేలేదు.

అయితే నేను కంటికి యింపుగా కనుపించను—అంటారు మీరు. నిజమే! కావచ్చు ఆడంబరంలేని ఆకారం నాది. నా అలవాట్లుకూడా అటువంటివే. కాని నా పువ్వులని ఎప్పుడైనా చూశారా? యదాలాపంగా చూసి వుంటారు. పరీక్షగా చూసివుండరు. నామీద మక్కువ లేకపోవడం అనేది నా పువ్వులమీదకూడా పాకివుంటుంది. ఈ సారి నేను కనుపించినప్పుడు నన్ను మరచి పువ్వులను చూడండి. అవి పసుపు ఛాయతో నక్షత్రాలు మెరిసినట్లు మెరిసిపోతుంటాయి. మీ మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే సువాసన వెదజల్లుతూ వుంటాయి.

నా యీ పువ్వునుబట్టే నన్ను సంస్కృతకవులు స్వర్ణ పుష్ప అ వర్ణించారు. అంటే బంగారు పువ్వన్నమాట నేను. అలా ఆశ్చర్యంగా చూస్తున్నారేం? చిట్టి చిట్టి ఆకులతో, ముళ్ళతో, కొక్కిరి కాయలతో పొగ

మారిన దానికి మల్లే వుండే నే నేమిటి? స్వర్ణ పుష్పమేమిటి?-అని ఆశ్చర్య పడుతున్నారు కదూ! బహుశా నాకీ పేరిచ్చిన సంస్కృత కవులకు వృద్ధాప్యంవల్ల, మతిచెడి వుంటుందనికూడా మీరు అనుకుంటూ వుండి వుంటారు. దృష్టి మారినప్పుడు అట్లాగే అనిపిస్తుంది మరి!

నేను యిక్కడే కాదు, మన దేశంలో అన్ని చోట్లా వున్నాను. నన్ను పంజాబ్‌లో "కికార్" అని పిలుస్తారు. తమిళదేశంలో 'కరువేలం' అంటారు. కన్నడదేశంలో నన్ను రెండు పేర్లతో వ్యవహరిస్తారు— అందులో మొదటిది 'గొబ్లి' రెండవది 'బాల్'. అన్ని కాపులలోనూ పూర్వులు నన్ను అస్తారబతంగా పెంచేవారు. నేనువారికి అనేకవిధాల తోడ్పడి నా కృతజ్ఞతను తెల్పుకుంటూ వుండేదాన్ని.

నా జీవితం నాకున్నమాట నిజమే. నాకుండే ప్రేమలు నాకున్నాయి. నాకుండే కష్టసుఖాలు నాకున్నాయి. నా వంశం వృద్ధి చెందాలనే ఆశ నాకూ వుంటుంది. ఎన్ని వున్నా నన్ను ఆదరించే రైతులకోసం నేను ఆత్మార్పణ చేసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే వుంటాను. నా ప్రత్యేకతను చంపుకుని యే కంచెరూపంలోనో, ఇతర చెట్లను ఇతర జీవాలను రక్షించడానికి కూడా పూనుకుంటానంటే యిక వేరుగా చెప్పవలసింది ఏముంది? మీకు యిన్ని విధాల తోడ్పడుతున్న నేను మీనుంచి కోరే దేముంది? ఒక మంచిమాట, ఒక చల్లనిచూపు! అదేనేడు కరువైంది.

సహజంగా నన్ను గురించి నేను చెప్పుకునే స్వభావం కాదు నాది. గొప్పలు చెప్పుకోవడం నాకు గిట్టదు. కానీ, యిప్పుడు తప్పనిసరైంది. నన్ను యిన్నాళ్ళనుంచీ సొంత బిడ్డలాగా చూసుకుంటూ వచ్చిన రైతు యిటీవల మరణించాడు. అది హఠాన్మరణం. ఆ సాయంకాలం పొలంపని చూచుకుని, గొడ్లను పాలేరుతో ఇంటికితోలి, కాసేపు గట్టుమీద కూర్చుని ముఖమార్జనకు పనికివచ్చే నాలుగు పుల్లలు నా నుంచి విరుచుకుని ఇంటికి వెళ్ళాడు. తెల్లవారి, ఆయన రాత్రే కాలధర్మం చేశాడని నాకు తెలిసింది. భోజనం చేసుకుని పడుకుని,పడుకున్నవాడు పడుకున్నట్టుగా మరణించాడట. హాయి అయిన చావే! ఎవ్వరం అయినా కోరుకోదగ్గ చావే—కానీ, నా

గుండె బేజారెత్తింది. ఏమెత్తీ చేసేది ఏముంది! శోకం దిగమింగి వూరు కున్నాను.

నా ఖామందుకు మగపిల్లలు లేరు. ఒక్క కుమార్తె మాత్రమే వుంది. ఆమెను నేను చిన్నతనంలో ఎరుగుదును. నా ఖామందు ఆరోజుల్లో ఆమెను అప్పుడప్పుడూ పొలం తీసుకువస్తూ వుండేవాడు. ఆమెకు నా పువ్వులన్నా జిగురన్నా ఇష్టం. నాకు ఆమె చూస్తే చెల్లెల్ని చూసినట్లే వుండేది. ఆమె పెరిగి పెద్దదయింతరువాత ఇటు ప్రక్కకురావడమే మాను కుంది. నిరుడే ఆమెకు వివాహం అయింది. ఇవాళ ఉదయం ఆమె భర్త పొలం వచ్చాడు. ఎంతగర్వంగా అడుగులు వేసుకుంటూ వచ్చాడను కున్నారు? ఆయన వైఖరి చూస్తే ఎన్నడూ పొలందిక్కుకు వచ్చినమనిషిగా కనపడలేదు. కూతురు సుఖపడుతుందని నాఖామందు తనకూతుర్ని ఉద్యోగం చేసుకునే ఆయనకు యిచ్చాడు. ఆయన పొలం గట్టుమీద నిలబడి నన్ను కాసేపు ఎగాదిగా చూశాడు.

"ఎందుకీ మోడు, యిక్కడ?" అన్నాడు. ఆ మాటలకు నాగుండెల్లో బాకు దింపినంత పనయింది.

ప్రక్కనున్న పాలేరు నా అవుసరాన్ని చెప్పాడు.

'అవన్నీ పాతకాలం మాటలు. ఇప్పుడు ఏ రకం కలప కావా లన్నా ఎక్కడపడితే అక్కడ దొరుకుతుంది" అన్నాడు కొత్త ఖామందు.

"ఈ చెట్లువల్ల భూమికిబలం వస్తూందట."

"చెట్టువల్ల భూమికి బలం రావడ మేమిటి?" అని నవ్వాడు కొత్త ఖామందు. "ఎరువులకంటేనా?" అన్నాడు.

"ఏ దెట్లాగయినా దొరమ్మగారికి పొయ్యిలోకైనా పనికివస్తుంది" అన్నాడు పాలేరు.

"టవున్ నుండి సంవత్సరానికి సరిపడా సరకుకట్టేఒకేసారి తెప్పించు కుంటే సరిపోయె" అన్నాడు నా కొత్త ఖామందు.

"వచ్చే సంవత్సరానికి కొత్తగిత్తలను కట్టడానికి బండి చేయిద్దాం అనుకుంటూవుండేవాడు దొర" అన్నాడు పాలేరు.

"అంతగా బండి కావాలంటే టేకుకర్రలు తెప్పించవచ్చు—ముందీ మోడుని వేళ్ళతోసహా కొట్టిపారేయండి" అన్నాడు ఖామందు.

ఎంత నిర్లక్ష్యం! ఇతర జీవాలంటే కాస్త కాకపోయినా, కాస్తయినా కరుణలేదుగదా? పైకి పెద్ద పెద్ద కబుర్లు చెపుతారు. పూర్వీకులకు తెలియని అనేక విషయాలు కనిపెట్టాం అంటారు. చెట్లకూ ప్రాణం వుందనీ, చెట్లూ నిద్రపోతవని ఇటీవల శాస్త్రజ్ఞులు కనిపెట్టారని, చెపుతుంటారు. పూర్వీకులకు ఈ సంగతి తెలియదనీ, ఈ సంగతి నవీన యుగంలో కనిపెట్టబడిందనీ చెపుతారు. పూర్వులకు ఈ సంగతి తెలియకపోయినా, మేమూ తమ కుటుంబంలో ఒకరిమే అన్నట్లు ప్రవర్తించేవారు. ఇప్పుడో, సమస్త జీవకోటిలోనూ ప్రాణం వున్నదని చెబుతారు. కానీ ప్రాణం తియ్యడానికి మాత్రం ఏమాత్రం తడబడరు.

చావడానికి నాకు భయంలేదు. నా ఖామందు ఉపయోగానికి చావడానికే నేను పుట్టింది. నా వుపయోగం తెలిసిన మనిషికోసం సంతోషంగా ఆత్మార్పణం చేసుకుంటాను. కాని, ఈ చావు ఎవరికోసం? దేనికోసం? పైగా వేళ్ళతోసహా దున్నివేయమంటున్నాడు నాకొత్త ఖామందు. నాజాతి అంటేనే ఆయనకు గిట్టదు.

అదుగో వస్తున్నారు. కొత్తఖామందు—ఇద్దరు కూలీలను వెంటబెట్టుకుని వస్తున్నాడు. వాళ్ళ చేతుల్లో గొడ్డళ్ళను చూశారా! నాకొత్త యజమాని నడక చూశారా? ఎక్కడ పాదాలకు మట్టి అవుతుందోనని ఎత్తిఎత్తి వేస్తున్నాడు. ఈ స్థితిలోకూడా నవ్వువొచ్చింది నాకు. ఆజన్మ విరోధిని జయించడానికి వస్తున్నట్లు వుంది ఆయన వైఖరి. నాకు ఆయన అమాయకత్వానికి జాలివేసింది. ఒక్కక్షణం నా సంగతి చెప్పుకుందా మనిపించింది. చెప్పుకుంటే మాత్రం వినడానికి ఆయనకు తీరికవుందా? విన్నా అర్థమవుతుందా? పోనీయ్, ఈ బ్రతుకు బ్రతికినదానికంటే చావడమే మేలు అనుకున్నాను. కళ్ళుమూసుకుని నిలబడ్డాను. ప్రాణంమీద తీపివల్ల ఏదో ఒక పనిచెయ్యడానికి నేను మనిషిని కాదుకదా!

)o....o....o(